

కథా కౌముది

# పొట్లకాయ పందిరి డా.చెళ్ళపిళ్ల సూర్యలక్ష్మి



పిడపర్తి వెంకటరమణశర్మగారి జ్ఞాపకార్థం
కౌముది నిర్వహించిన కథల పోటీ (2023)లో
సాధారణ ప్రచురణ కథ

1950వ దశకం...

అర్ధరాత్రి కావస్తుండగా హాస్టల్ గది తలుపు చప్పుడు విని విసుక్కున్నాను. అసలే ఎంబీయే విద్యార్థిని కదా, ప్రశాంతమైన రాత్రి పూట సీరియస్‌గా ఏ ఈక్వేషనో సాల్వ్ చేసుకుంటుంటే ఈ డిస్టర్బెన్స్ ఏమిటి, అని తిట్టుకున్నాను. ఏమిటేమిటి? నా రూమ్-మేట్, అదే, ఆ రామదాసు గాడయ్యుంటాడు. చూస్తే, వాడే. నా వాలకం తెలిసిన వాడెవ్వడూ నేను గీసిన గీత దాటడు, ఒక్క వీడు తప్ప. కానీ, ఇప్పుడు వాడితో మరొకడున్నాడు. విసుగ్గా, “వీడెవడు?” అని అడిగాను.

నేనేదో బూతు మాటన్నట్టు మొహం పెట్టుకుని, “ఇతను, వింటున్నావా, ఈ అబ్బాయి పేరు ఏడుకొండలు. మా స్కూల్ బంట్రోతు బాబులు గారబ్బాయి. బీయే ప్రయివేట్ గా కట్టాడట. ఆశీలుమెట్ట దగ్గర కనిపించాడు. పాపం బయటుండి, డబ్బులేం తగలేస్తాడని మనతోనే ఉంటాడని ఇక్కడకి తెచ్చాను. మనలని ఇబ్బంది పెట్టడు. కింద ఒక దుప్పటి పరచుకుని పడుక్కుంటాడు, మిగతా సమయాల్లో బయట చదువుకుంటాడు, బయటే తింటాడు. పది రోజులు బస. సరేనా?” అన్నాడు రామదాసు.

‘పెద్ద.. నేను వద్దంటే అవతలి వాణ్ణి గెంటేసేవాడిలా పోజు’, అని మనసులో ఆ రామదాసు గాణ్ణి తిట్టుకుంటూ, పళ్ళు పటపట కొరికాను. వాడసలు నేను ఒప్పుకున్నానో లేదో కనుక్కోకుండా, చెట్టంత మనిషినైన నా ఉనికిని గుర్తించనట్టు, ఆ వచ్చినవాడికి పరీక్ష హాలు గురించి ఏవో చెప్పసాగాడు. ఏదో సంఘ సేవా శాస్త్రంలో ఎమ్.ఏ.

రెండవ ఏడు వెలగబెడుతుంటే, ప్రపంచం బాధ్యత అంతా తన నెత్తినే వేసుకోవాలి అనుకున్నాడు కాబోలు, అని వాణ్ణి మనసులో ఆడిపోసుకున్నాను.

మరునాడు, ఆ కొత్తవాడు హాస్టల్లోనే తినడం గమనించాను. మేనేజర్ని అడిగితే, వాడు రామదాసు గాడి గెస్ట్ అని చెప్పాడు. 'తా దూర కంత లేదు, మెడకో డోల'న్నట్టు, అప్పుడప్పుడు రామదాసు నా దగ్గర చేబదులు తీసుకుంటాడు, అలాంటిది వాడికి ఈ అదనపు ఖర్చు అవసరమా? జనాలకి బుద్ధి ఉండదంటే ఇదేనేమో, అని నెత్తి బాదుకున్నాను.

★★★

కొన్నాళ్ళ తరువాత ఒక తలమాసిన ముసలిని తీసుకొచ్చాడు. చాలా రోజులుగా స్నానం చేయలేదేమో! ఎవరో సన్నకారు రైతట, వ్యాజ్యం నిమిత్తం వచ్చాడట. 'ఆయుష్షు నూరేళ్లు, వ్యాజ్యం వెయ్యేళ్ళు', అని పెద్దలు ఊరికే అనలేదు కదా! అతని పరిస్థితి చూస్తేనే తెలుస్తోంది, చితికిపోయాడని! "ఈ దివాలాగాడికి కూడా నువ్వు ఆతిథ్యం ఇవ్వాలా?" అని అడిగాను, విసిగిపోయి. "నువ్వు చేసే ఈ చిన్నపాటి సాయానికి లెక్క చూసుకుంటావా?" అని, నా నోరు నొక్కేశాడు.

వాడు సాయం చేసినా, నా పేరు చెప్తున్నాడు కాబట్టి, నేనేమి అనగలను? 'ఓరీ, నువ్వు వెర్రిబాగుల వాడివనుకున్నానురా! ఏమి తెలివి, ఏం తెలివి?' అని గట్టిగా తిట్టుకున్నాను, కానీ మనసులో! 'కనీసం ఆ మనిషిని సముద్రస్నానం చేసి వెళ్ళమను', అనో వెటకారపు సలహా పారేద్దామనుకుని, అతి కష్టం మీద నోరు నొక్కుకున్నాను.

★★★

ఇలాగే, గడిగడికీ ఎవరో ఒకళ్ళని తెచ్చి ఆశ్రయం ఇవ్వడం వీడికి, అదే, రామదాసు గాడికి అలవాటైపోయింది. నాకు మాత్రం ఈ సంవత్సరం ఎలా గడుస్తుందా అని బెంగ పట్టుకుంది. నా చదువు గురించి నేను ఏవో ప్రణాళికలు వేసుకుంటే, ఉరమని వర్షంలా వీడితో మరొకడు ఊడిపడతాడు.

మా ఇంట్లో అందరం నేల మీద జంబుకానాలు పరుచుకుని పడుక్కునే వాళ్ళం. కనీసం ఇక్కడ మనిషికో మంచం, గదికి ఇద్దరు అనే రూల్సున్నాయి కాబట్టి సంతోషంగా విశ్వవిద్యాలయంలో చేరాను. నా గతాన్ని గుర్తు చేయడానికే పుట్టిన ఈ రామదాసు గాడు నాకు ఇక్కడ దాపురించాడు!

★★★

నా అభ్యంతరాలకేం గానీ, కొన్నాళ్ళకి నాకు వీడి పద్ధతి మామూలైపోయింది. వాడో పరోపకారి పాపన్న అనుకుని, వాడితో వచ్చిన రకరకాల మనుషులతో ఉండడం అలవాటు చేసుకుని, ఎట్టకేలకి మనసుని కోపం నుండి దూరం చేసుకుని, చదువు మీద శ్రద్ధ పెట్టగలిగాను.

నన్ను మరో భయం తరచూ ఆవహించేది- ఒక ఏడాది సహవాసంలో ఆ రామదాసు గాడి 'తన్ను మాలిన ధర్మం' టైపు పనులు అబ్బవుకదా! అని. అయినా, గట్టిగా తీర్మానించుకుని, వాడు చేసే సహాయాల వంటి వాటి జోలికి పోకుండా, బంగారు పతకాన్ని సాధించడానికి చాలా కృషి చేయ్యడం మొదటి ఏడాది నుండే మొదలెట్టాను.

★★★

నా ఎంబీయే రెండవ సంవత్సరపు పరీక్షల సమయంలో జరిగిన స్నాతకోత్సవంలో బంగారు పతకం తీసుకోవడానికి వచ్చాడు రామదాసు గాడు. అసలు ఎప్పుడూ జనాలని పోగేసుకొని తిరుగుతూ ఉండేవాడికి, అసలు చదివినట్టు కనిపించని వాడికి, మొదటి ర్యాంక్ ఎలా వచ్చిందో నాకు అంతుబట్టలేదు సుమీ! మేమిద్దరం కలిసి ఇంచుమించు ఏడాది అవుతున్నా, అసలు మొగమాటం రవ్వంత కూడా లేకుండా, "సారథీ, నా పతకం తీసుకుని రేపు వెళ్ళిపోతానోయ్, ఈ రాత్రికి నువ్వూ, నీ రూమ్-మేట్ కాస్త నన్ను భరించండి", అనేసి, మా అనుమతి గురించి ఆగకుండా, గదిలోనే, నేల మీద దుప్పటి పరచుకున్నాడు.

నా ఖర్మకొద్దీ ఇప్పటి రూమ్-మేట్ కూడా వాడి టైపు (అయితే, రామదాసు గాడికి సాటి మరెవరూ ఉండరు!); వాడు చేసిన సంఘ సేవ గురించి వీడు అడగడం, వాడు పొంగిపోతూ జవాబులు చెప్పడం టకటకా జరిగిపోయాయి. నన్నెవరూ మెచ్చుకోరు గానీ, నేను అందరి మధ్యా ఉండి కూడా చెవులని మాత్రం దూది లేకుండా మూసుకోగలను. అలాగే దూరంగా ఎవరైనా మాట్లాడుకుంటుంటే అక్షరం పొల్లుపోకుండా పసిగట్టెయ్యగల పాము చెవులు నావి!

విషయం అర్థమయిన వెంటనే, నా చెవులు ఆటోమేటిక్‌గా మూసుకుపోయాయి. నాకెంత చిరాకు వచ్చిందంటే వాడు ఇప్పుడు ఏ ఉద్యోగం వెలగబెడుతున్నాడో కూడా కనుక్కోలేదు. అంత విసుగు నాకు వాడి చనువు, వాలకమూ చూస్తే! వాడు మాత్రం నా మనసులో ఉన్న అసహనాన్ని గ్రహించలేక, ఆ రాత్రికి ఉండి, మరుసటి రోజు టిఫిన్, భోజనాలకు తనే డబ్బు చెల్లించి, పతకం తీసుకుని, మాకు ధన్యవాదాలు చెప్పి, వెళ్ళిపోయాడు.

నేను ఇంతటి గందరగోళ పరిస్థితుల్లో కూడా నా ఏకాగ్రత కోల్పోకుండా, పరీక్షలు బాగా వ్రాసి, ఆశపడ్డ విధంగా బంగారు పతకాన్ని సంపాదించుకున్నాను. భూభారం మోసే అట్లాస్ లాంటి ఇద్దరు రూమ్-మేట్స్ పాలపడినా కూడా, వాళ్ళ చేత ప్రభావితం కాకుండా మొత్తానికి విశ్వవిద్యాలయం నుండి బయటపడ్డాను. ఉఫ్..

ఇంజనీరింగ్, మ్యానేజ్మెంట్ డిగ్రీలున్నాయి గనుక అప్పుడప్పుడే స్థాపింపబడిన ఒక ప్రభుత్వరంగ సంస్థలో చేరాను. వృత్తిలోనూ, వ్యక్తిగతంగానూ ఎదగడానికి ఎప్పటిలాగే, 'నేను–నా వృత్తి–నా వాళ్ళు' అనే అంశాలకి ప్రాధాన్యతనిస్తూ బ్రతికేద్దామని నిశ్చయించుకున్నాను.

★★★

1960వ దశకంలో...

నేను ఒక డ్రాయింగ్‌ని పరిశీలిస్తుంటే, నా కింద పనిచేసే గుమాస్తా రమణ వచ్చి, "సార్, మావోడికి ఒళ్ళు కాలిపోతోంది. అర్జెంట్‌గా పెద్దాసుపత్రికి తీసుకుని వెళ్ళాలన్నారు మన డాక్టర్ గారు", అన్నాడు. నేను దించిన తల ఎత్తకుండా, "అయితే సెలవు పెట్టి వెళ్ళండి", అన్నాను.

అతను అదుర్దాగా, "అది కాదు సార్, పెద్దాసుపత్రిలో ఎలాంటి ఖర్చులుంటాయో తెలియదు కనుక ఓ వంద రూపాయలు పిఎఫ్ పెట్టాను. ఇవ్వాళ్టి బిల్లులు పాస్ అయిపోయాయట. రేపటి వరకూ పాస్ చేయరట. మీరు అక్కడి సూపర్నెంట్ గారికి ఓ మాట చెప్తే..." అన్నాడు.

"చూడండి రమణా, నేను టెక్నికల్ ఆఫీసర్ని. అక్కౌంట్స్ డిపార్ట్మెంట్‌లో సూపర్నెంట్ నా మాట ఎందుకు వింటాడు చెప్పండి! వీలైతే అక్కౌంట్స్ ఆఫీసర్ని వెళ్ళి కలవండి", అని చెప్పి, అతని బెడద వదుల్చుకున్నాను.

పొరపాటున కూడా ఆ పిల్లాడి ఆరోగ్యం ఎలా ఉందని అడగలేదు. నాకెందుకొచ్చిన గొడవ? ఇలాంటి విషయాలెప్పుడు జరిగినా, నేను సుమతీ శతకంలో 'ధన్యు'ణ్ణవడానికే ప్రయత్నించేవాణ్ణోచ్! ఉత్తీర్ణుడయ్యే వాణ్ణి కూడా! కొన్నాళ్ళకి ట్యూబ్‌లైట్‌లాంటి మా వాళ్ళకి బల్బ్ వెలిగినట్టుంది, ఇలాంటి ఫేవర్ల కోసం నా దగ్గరకు రావడం మానేశారు.

★★★

1970వ దశకంలో...

నా కింద పనిచేసే ఒక ఆఫీసర్ తన ప్రమోషన్ నిమిత్తం ఇంటర్వ్యూ జరుగబోతోందని చెప్పడానికి వచ్చాడు. "బెస్ట్ ఆఫ్ లక్, సుధాకర్", అని కరచాలనం చేశాను. "సార్", అని నీళ్ళు నమిలాడు సుధాకర్. ఏమిటన్నట్టు చూశాను అతనికేసి. "సెలెక్షన్ కమిటీ వాళ్ళకి నా గురించి రెండు మంచి ముక్కలు చెపితే..." అన్నాడు.

నేను అగ్గి మీద గుగ్గిలమైపోయాను. "రికమండేషనా? చూడండి, మీకు మెరిట్ ఉంటే ఆ ప్రమోషన్ మీకే వస్తుంది. నేను కేవలం నా టాలెంట్ మీదే ఈ ఉద్యోగం, ప్రమోషన్లూ, తెచ్చుకున్నాను, తెలుసా?" అన్నాను కోపంగా.

గతుక్కుమన్న సుధాకర్, "సార్, క్షమించండి. నేను కూడా నా టాలెంట్ తోనే ఈ ఉద్యోగం తెచ్చుకున్నాను. ఇప్పుడు రోజులు మారాయి. ఆ ప్రమోషన్ కమిటీలో ఒకాయన లంచమిచ్చిన వాళ్ళ పేర్లు సిఫారసు

చేస్తానన్నారట. లంచం ఇచ్చుకోవడం నాకిష్టం లేదు. దాని బదులు, ఎవరైనా పెద్ద వాళ్ళ చేత సిఫారసు చేయించుకోవాలని అనుకున్నాను. పోనీలెండి", అని మొహం మాడ్చుకుని వెళ్ళిపోయాడు. అతనికి ప్రమోషన్ రాలేదు. కానీ, దానికి కారణం నేనని నేనేనాడూ అనుకోలేదు.

ఈ ఉదంతం జరిగిన కొన్నాళ్ళకి నాకు ఒక బిరుదు అనధికారికంగా ప్రదానం అయ్యింది. మనుషులు నన్ను తేలిక చేసి, 'సాయంచెయ్యని సారథి సార్' అని ఎందుకు పిలిచేవారో అర్థం కాలేదు. రూల్స్ మాట్లాడితే ఇన్ని కష్టాలా?

★★★

1980వ దశకం చివరిలో...

స్కూటర్‌ని పార్క్ చేసి లోపలికి వస్తున్న మా అబ్బాయితో, ఆతృత అపుకోలేక, "రాజూ, సంధ్యని జాగ్రత్తగా రైలు ఎక్కించావు కదా! పరధ్యానంగా ఉన్న మా వాడు అవునన్నట్టు తలాడించి లోపలికి వెళ్ళాడు. వాడు ఫ్రెష్ అయి వచ్చిన తరువాత, "ఏ రైలు ఎక్కించావేమిటి?" అని అడిగాను. వాడు, "ఈస్టు కోస్టు", అని పొడిగా జవాబిచ్చాడు.

"మరింత లేటు అయ్యిందేమిట్రా? రైలు గాని లేటా?" అన్నాను. అవునన్నట్టు తలూపాడు. "మరి సంధ్య వాళ్ళ అత్తారికి చెప్పావుట్రా?" అన్నాను. "వాళ్ళ ఫోన్ పలుకలేదు. బహుశః డెడ్ అయ్యిందేమో! రాత్రి మళ్ళీ ప్రయత్నిద్దాం లెండి", అన్నాడు.

నా గుండెల్లో రైళ్ళు పరుగెత్తడం మొదలుపెట్టాయి. ఒక పక్క నుంచి సంధ్య వాళ్ళూరికి వెళ్తోందని వాళ్ళకి తెలియదు. పైగా రైలు లేటట. ఇంకా లేటయితే వయసులో ఉన్న ఒంటరి ఆడపిల్ల ఇంటికి క్షేమంగా వెళ్ళగలదా? ఒక వేళ, ఏ అర్థరాత్రో అపరాత్రో ఇల్లు చేరాక, వాళ్ళు ఇంట్లో లేకపోతేనో? అయ్యబాబోయ్, ఆలోచిస్తేనే దడ పుడుతోంది. అందుకే వాడితో ఈ అనుమానాలన్నీ వ్యక్తం చేశాను.

వాడు, "నాన్నా, ఒక పెద్దాయనని చూసుకోమని కోరాను లెండి! అయినా, అసలే మండుటెండ. పైగా, మనం ఉండేది ఏ ఊటీయో, సిమ్లానో కాదు. బ్లేజ్ వాడ.. విజయవాడ. తలబద్దలవుతోంది. అమ్మనడిగి, కాఫీ తాగి, అప్పుడు మీ రాపిడ్ ఫైర్ ప్రశ్నలకి జవాబు చెపుతాను... నో, నో అసలే మీరు ఎక్కువ ఒత్తిడికి గురి అవకూడదని డాక్టర్ గారు చెప్పారు కదూ! సో క్వశ్చన్ అవర్ ఈజ్ క్లోజ్డ్ ఫర్ టుడే అధ్యక్షా", అనేసి వంటింటి వైపు వెళ్ళాడు రాజు.

వాడు చెప్పిన మాటలు నిజమే, కానీ నా మనసు కలవరపడింది. సంధ్యకి పెళ్ళయ్యి ఇంకా ఆరు నెల్లు కూడా కాలేదు. దాన్ని దిగబెట్టాలంటే రాజుకి సెలవు దొరకలేదు. అదెందుకంటే, ఈ మధ్యనే నాకు గుండెపోటు వచ్చింది కాబట్టి. పోనీ, ఇంకెవరినైనా పంపిద్దామంటే, నేను 'ధన్యు'ణ్ణి కదా, నాకెవరు సాయం చేస్తారు?

వియ్యాల వారు మంచివాళ్ళే కానీ కొంత మాట పట్టింపు మనుషులు. నన్ను చూడడానికి వచ్చిన నా ముద్దుల కూతురు, నా గారాల పట్టి, నేను డిశ్చార్జ్ అయిన వెంటనే వాళ్ళ ఊరు, విశాఖపట్నం, వెళ్ళనందుకు మొహం మాడ్చుకున్నారు. అందుకే దాన్ని అంత అర్జెంట్‌గా పంపించవలసి వచ్చింది. లేకపోతే హాయిగా ఫస్ట్ క్లాస్‌లో టికెట్ బుక్ చేయించి పంపించేవాణ్ణి.

అవునసలు, వీడు దాన్ని ఏ బోగీలో ఎక్కించాడో? ఇలా నేను ఆలోచించానో లేదో, అప్పుడే వంటింటిలోంచి గుసగుసలకి ఎక్కువ, మామూలు గొంతుకకి తక్కువగా తల్లీకొడుకుల సంభాషణ లీలగా వినవచ్చింది. అంతే, నా రెండో టాలెంట్‌ని పనిలోకి పెట్టి, చెవిలో ఉన్న నా యాంటినాని వంటింటివైపు మనసులోనే అమర్చాను.

"ఆదేమిట్రా, మరీ జనరల్ బోగీలోకి దాన్ని ఎక్కిస్తావా? ఇంటికి తెచ్చేయలేకపోయావా?" అంటోంది మా ఆవిడ. "వాళ్ళ వాళ్ళతో మాటొస్తుంది, గాడిదగుడ్డూ అని నువ్వే కదమ్మా దాన్ని బయలుదేరదీశావు? ఇప్పుడిలా అంటే ఎలా? అసలే సెలవుల సీజను, ట్రిప్పుల సీజనూను", కోపంగా అంటున్నాడు రాజు.

"పోనీ, దాని చుట్టుపక్కల కుటుంబాలున్నాయా?" భయమూ, ఆతృతా కలగలిసిన గొంతుతో అడుగుతోంది శాంత, అదే మా ఆవిడ. "అంతా మగవాళ్ళేను, కానీ, వాళ్ళలో ఒక పెద్దాయన గౌరవస్తుడిలా ఉన్నారు. ఆయనది కూడా అనుకోని ప్రయాణమట. ఆయనతో దాన్ని పోలీసులు నెంబర్ ఎక్కించుకునే ఆటో స్టాండ్‌లో ఆటో ఎక్కించమని రిక్వెస్ట్ చేసి, కాస్త చూసుకోమని అప్పచెప్పి వచ్చా", అంటున్నాడు మా పుత్రరత్నం.

"ఒరేయ్, బుద్ధుందా, లేదా?" అని గట్టిగా అరిచి, నా పరిస్థితి గుర్తొచ్చిందో ఏమో, మళ్ళీ గొంతు తగ్గించి, "కనీసం, ఆయన ఎవరో, ఏం చేస్తారో కనుక్కున్నావా?" అడుగుతోంది శాంత. "నేనడిగే సరికి రైలు కూత కూసింది. సంధ్యతో చెప్పమని చకచకా దిగిపోయా", అంటున్నాడు మా బుద్ధి లేని బడుద్ధాయి.

"అఘోరించావులే", నా మనసులోని మాటని అంటోంది నా సహధర్మచారిణి. మళ్ళీ తనే, "సంధ్య క్షేమంగా ఇంటికి వెళ్తే నువ్వు తిరుమలకి మెట్లెక్కి వెళ్తానని మొక్కుకో. నేను, మీ నాన్నా గుండు చేయించుకుంటాం, సరేనా?" అని కోపంగా అన్నట్టు వినిపించింది. మా పనికిమాలిన పుత్రుడు తలూపాడో ఏమో, వాడి జవాబు నా యాంటినాకి అందలేదు.

నా గుండెల్లో కల్లోలం వర్ణింపనలవి కాదు. అసలు, ఈ గుండెపోటు బదులు ఏకంగా పోయుంటే, పీడా పోయేది. ఈ టెన్షన్ నాకుండేది కాదు కదా! నా కూతురు మాట పడకూడదని దాన్ని పంపించాను గాని, అదిప్పుడు ఎంత ప్రమాదంలో ఉందో ఏమో?

అయినా, ఆ వియ్యాలవారు అంత మాట పట్టింపుగాళ్ళయితే ఎలా? సమాజం కోసమా ఈ బూటకపు ప్రవర్తన? పెళ్ళయిన వెంటనే తల్లిదండ్రుల మీద ఉండే మమకారం పోవాలా? నేను డిశ్చార్జ్ అయిన రోజే అది తిరిగి వెళ్ళనందుకు మొహం మాడ్చుకుంటారా? 'కోర్టులో కలుద్దాం' అని గుడ్ బై కొట్టేసుంటే ఈ స్థితి వచ్చుండేది కాదు కదా!

మా ఆవిడ మా వాడితో, "పూర్తి వివరాలు నాన్నగారితో చెప్పకు; మనం దేవుడికి ప్రార్థిస్తూ కూర్చుందాం. సరేనా?" అని చెప్తూంటే నాలో ఒక నిస్పృహతో కూడిన నవ్వు మెదిలింది. నాకు వివరాలు తెలియవా? నేను బాధపడట్లేదా? ప్చ్...

మా బాధాగ్నిలో ఆజ్యం పోసినట్టు, రాత్రి కూడా వియ్యాలవారి ఫోన్ కలవలేదు.

★★★

మరునాటి ఉదయం... ఇంకా ఓ అంతులేని రాత్రల్లే తోచింది నాకు. రాత్రంతా కంటి మీద కునుకు లేదు. సంధ్య చేరినట్టు ఫోనూ లేదు. ఒక పక్క నుంచి ఇంకా ఎలా బతికున్నాననే ఆశ్చర్యం. మరో పక్క గుండె పేలిపోతుందేమో అన్నంత అలజడి నాలో! కానీ, మా వాళ్ళ కోసం నేను నటించాలి కదా!

పేరుకి స్నానపానాదులు కానిచ్చి, విశ్రాంతి తీసుకునే మిషతో ఫోన్ పక్కనున్న పడక కుర్చీలో తిష్ఠ వేశాను. ఎనిమిదిన్నర ప్రాంతాల్లో ఫోన్ మోగింది. ఎస్టీడీ టోన్. రెండవ రింగ్‌కే ఫోన్ తీశాను. అటుపక్క నుంచి, "నాన్నా, అదేమిటి మీరు ఫోన్ ఎత్తారు?" అంది సంధ్య, ఆశ్చర్యం కనబరుస్తూ. నా ప్రాణం లేచొచ్చినట్టయ్యింది.

"ఏవిటే అమ్మా, నిన్న రాత్రల్లా ఫోన్ లేదు?" అన్నాను దీనంగా. "సారీ నాన్నా, మిమ్మల్ని కంగారు పెట్టక తప్పలేదు.

"అసలేం జరిగిందంటే, నిన్న గుల్లిపాడు దగ్గర ఒక గూడ్సు బండి పట్టాలు తప్పడంవల్ల, మా రైలు విశాఖ చేరేసరికి అర్ధరాత్రి దాటింది. అన్నయ్య ఒక అంకుల్‌కి నన్ను అప్పచెప్పాడు కదా– ఆ అంకుల్ పాపం చొరవ తీసుకుని, 'ఈ సమయంలో ఒంటరిగా ఎలా వెళ్తావ'ని, వాళ్ళిల్లు ద్వారకా నగర్లో అయినా సరే, మా ఇల్లుండే సీబీఐ డౌన్ వరకూ వచ్చి, నన్ను దింపి, మా వాళ్ళు తలుపు తెరిచేవరకూ ఆగి, నన్నప్పచెప్పి మరీ అదే ఆటోలో వాళ్ళింటికి వెళ్ళారు.

"మా ఫోన్ డెడ్ కదా, నేను మాట్లాడలేకపోయాను. ఇప్పుడు ఎస్టీడీ బూత్ నుంచి మాట్లాడుతున్నా! కానీ, ఒక విషయం– ఆయన మంచితనానికి మా వాళ్ళు ఫ్లాట్ అయిపోయి, నా మీద కోపాన్ని వదిలేశారు! అది మరో ప్లస్ పాయింట్.

"ఆ అంకుల్ ఎంత మంచివారో! ఆయన మంచితనం రుచి చూసినందుకు నాకు గర్వంగా ఉంది", అని సంధ్య వివరించింది. నేను దేవుడికి ధన్యవాదాలు చెప్పుకుని, సత్వరంగా గుండు చేయించుకునే అవకాశాన్నీయమని దణ్ణం పెట్టుకుంటుండగా, శాంత, రాజు నా చుట్టూ చేరారు.

శాంత ఫోన్ అందుకుని ఏదో చెప్పబోతుంటే నా ముద్దుల కూతురు, నాతో మాట్లాడుతానంది కాబోలు, మళ్ళీ ఫోన్ నా చేతికి ఇచ్చింది. నా చిట్టి తల్లి, "నాన్నా, నిన్న నన్ను జాగ్రత్తగా చూసుకున్న ఆ అంకుల్ సాంఘిక సంక్షేమ విభాగంలో ఆఫీసర్ అట. అన్నట్టు, ఆయనా, మీరూ ఆంధ్రా యూనివర్సిటీ హాస్టల్లో రూమ్-మేట్స్ కూడానట. ఆయన పేరు రామదాసు గారు", అని ఉత్సాహంగా చెప్పింది.

కానీ, ఇటుపక్క నేనేమీ వినే పరిస్థితిలో లేను. నాలో ఏదో తెలియని పశ్చాత్తాపం. నేనెంత అంటీ-ముట్టనట్టున్నా, ఆ రామదాసు గాడు మాత్రం తనకు తోచిన రీతిలో నలుగురికీ మేలు చేసేవాడు. 'నేను-నా కుటుంబం', అనుకునే స్వార్థం నాది. 'వసుధైవ కుటుంబకం', అనే ఉన్నత ఆదర్శం వాడిది. దానికి తగ్గట్టు, ఇప్పుడు సాంఘిక సంక్షేమ శాఖలో పనిచేస్తూ, వాడి మంచితనాన్ని చాలామందికి పంచుతున్నాడు రామదాసు గాడు! స్వార్థంతో నేను సాధించిందేముంది, ఈ గుండెనొప్పి తప్ప!

"ఇంతకీ, ఆ అంకుల్ ఫోన్ నెంబర్ తీసుకున్నావా?" అని మా ఆవిడ సంధ్యని అడుగుతోంది. అదీ వాడి స్థాయి. నేను పొడ గిట్టని పొట్లకాయలాగ ఉన్నా, ఎల్లప్పుడూ పందిరిలా, నా కూతురితో సహా ఎందరో నిస్సహాయులకి ఆసరాగా నిలిచిన ఆ రామదాసు గాణ్ణే ఆదర్శంగా తీసుకుని, నా శేష జీవితం గడపాలని నిశ్చయించుకున్నాను.

★★★

2020వ సంవత్సరం..

కోవిడ్ ప్రపంచాన్ని అల్లకల్లోలం చేసినప్పుడు తొంభైయవ పడిలో ఉన్నా ఆరోగ్యంగా ఉన్న మేమిద్దరం జనాలలోని నిరాశ-నిస్పృహ పోగొట్టడానికి ఒక కొత్త ఆలోచన చేశాం. 'టెలిగ్రామ్' యాప్‌లో ఒక బృందాన్ని ఏర్పాటు చేసి, 'రోజుకో ప్రశ్న' అనే శీర్షికన ఆ బృంద సభ్యులకి ఒక కాలక్షేపం కల్పించాము. 'చిన్నప్పటి ఆటపాటలు' ఒకరోజున, 'నిష్కామ కర్మ' అని మరో రోజున- ఇలా రకరకాల శీర్షికలపై సభ్యుల చేత మాట్లాడించి, వాళ్ళని తీపి జ్ఞాపకాలలో ఊయలలూగించి, ఆ సంతోషం ముందు ఇప్పుడొచ్చిన కరోనా పెద్దదేమీ కాదని అనుకునేటట్టు చేశాం.

ఆలోచన రామదాసు గాడిదీ, ఆచరణ నాదీను- సభ్యులకు కనపడే ముఖం నాది కనుక నాకు చాలా మంచి పేరొచ్చింది. ఆ రామదాసు గాడికి పేరు-ప్రఖ్యాతులొక లెక్కా? ఇన్ని వందల మందిని దురాలోచనల నుండి దూరం చేసినందుకు 'పందిరి'లా సంతోషించాడు. అంతే! ★ ★ ★

COMMENTS